క్లుప్తంగా

పాడిరైతులకు ఎంతో మేలు



సమావేశంలో మాట్లాడుతున్న సహాయ సంచాలకుడు విజయరెడ్డి

అమలాపురం రూరల్: జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు విజయరెడ్డి తెలిపారు. శనివారం కామనగరువు, బండారులంక, నడిపూడి, పాలగుమ్మి, వన్నెచింతలపూడి, జి.అగ్రహారం, తాండవపల్లి గ్రామాల్లో పశుసంవర్ధక, డీఆర్‌డీఏకు చెందిన వివిధ విభాగాల అధికారులతో జగనన్న పాల వెల్లువ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఉద్దేశంతో పాటు దళారీల దోపిడీని అరికట్టడానికి జగనన్న పాల వెల్లువ కేంద్రాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయప్రసాద్, సర్పంచ్‌లు తిరుకోటి సుజాత, సునీత తదితరులు పాల్గొన్నారు.

షర్బత్తు పంపిణీ ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక నల్లవంతెన–ఎర్రవంతెన మధ్య బైపాస్ రోడ్డులోని దక్షిణేశ్వర శ్రీకాలభైరవ శక్తి స్థల్‌లో తమళనాడు రాష్ట్రం మద్రాసు సాంబారు మసాలా సంస్థ వితరణగా అందించిన షర్బత్తు పానీయాన్ని వేసవి చలి వేంద్రం ద్వారా శనివారం నుంచి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ప్రారంభించి పాదచారులకు, వాహన చోదకలకు షర్బత్తు అందించారు. కార్యక్రమంలో అక్షయ పాత్ర సభ్యులు కనక దుర్గ, కుమారి, అన్నపూర్ణ, వరప్రసాద్, విస్సు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

యానాం: యానాం మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అర్ధరాత్రి పట్టుకున్నామని ఎస్‌ఐ శేరు నూకరాజు తెలిపారు. అల్లవరం మండలం గౌతమీనగర్, బోడసకుర్రుకు చెందిన నేరేడి మిల్లి బేతాళకుమార్‌లు స్కూటీపై రూ.5,500 విలువచేసే 55 టిన్నుల బీరులు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసి స్కూటీని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. యానాంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి బోడసకుర్రులో అధిక రేట్లకు అమ్ముకోవడానికి మద్యాన్ని తరలిస్తున్నారన్నారు.

ఉప్పంగల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సందర్శన

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో చెరువుల ఆధునీకరణ చేపట్టాలని ప్రజల నుంచి డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో తాళ్లరేవు మండలంలోని ఉప్పంగలలో రక్షిత మంచినీటి పథకం అమలు తీరును శనివారం యానాం ఆర్‌ఏఓ మునిస్వామి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సిబ్బంది మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో ఇక్కడ నుంచే 10 గ్రామ పంచాయతీలకు ఫిల్టర్ చేసిన నీటిని పంపుతున్నామని ఆర్‌ఏఓకు వివరించారు. కొన్ని ఎకరాల విస్తీర్ణంలోని రక్షిత మంచినీటి చెరువు, మైక్రోఫిల్టర్, పంపుహౌస్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ బడుల్లో చేరికకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

ఐ.పోలవరం: మండల పరిధిలోని బైరవపాలెంలో విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్చాలని కోరుతూ ఎంపీపీఎస్ టెంపుల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు తరంగిణి, ప్రవీణ, ఇతర ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు.

ఎమ్మెల్యే చిట్టిబాబు పరామర్శ

అమలాపురం రూరల్: అమలాపురం ప్రైవేట్ ఎలక్ట్రికల్ బీగ్రేడ్ లైసెన్స్ యూనియన్ మాజీ గౌరవ అధ్యక్షుడు చిక్కం తాతారావు మృతికి పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సంతాపం తెలిపారు. తాతారావు కుమారుడు కిట్టు, కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. తాతారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపినవారిలో వైఎస్సార్ సీపీ నేత వాసంశెట్టి చినబాబు తదితరులున్నారు.

ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు

ముమ్మిడివరం: తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ముమ్మిడివరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమైక్యాంధ్ర శిబిరంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రిలే నిరహార దీక్షలు చేపట్టారు.

తహసీల్దారుకు ఫిర్యాదు

ఐ.పోలవరం: శ్మశానవాటిక భూమిని కొంత మంది కబ్జా చేశారని జి.వేమవరం పరిధిలోని చిన్న కొడప, పెద్ద కొడప గ్రామాలకు చెందిన ఎస్సీలు శనివారం తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తూ వినతి పత్రం అందజేశారు. దీనిపై ఈ నెల 15న జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయగా ఈ నెల 18న సర్వే నిర్వహించి సర్వే రాళ్లను పాతగా వాటిని ధ్వంసం చేశారన్నారు. అధికారులు కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కుంచే చినబాబు, రేవు శ్రీను, పి.శ్రీనివాస్ తదితరులు కోరారు.

పరకే బంగారమాయెనే..

- ఎండు గడ్డికి తీవ్ర కొరత
- కోతల వేళ అకాల వర్షాలతో పాడైన గడ్డి

ఉప్పలగుప్తం: రైతుకు వ్యవసాయంతో పాటు పాడి పశువులను పెంచటమే ముఖ్య జీవనాధారం. అటువంటి అన్నదాతలు ప్రస్తుత పరిస్థితుల్లో పశువులను పెంచడం క్రమేపి తగ్గిస్తున్నారు. వరి గడ్డి రేటు విపరీతంగా పెరిగిపోవడమే దీనికి ప్రధాన కారణమని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. ఈ ఏడాది రబీ పంట చేతి కొచ్చి కోతలు నిర్వహించే సమయంలో అకాల వర్షాలు సంభవించాయి. దీంతో రైతులు కంగారుగా పండిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే క్రమంలో వరి కోత యంత్రాలతో కోతలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆరుదలకు వచ్చిన చేలు వర్షాలకు తడవటంతో యంత్రాల దాటికి గడ్డి పూర్తిగా పాడైంది. దీని వల్ల ప్రస్తుతం ఎండుగడ్డికి తీవ్ర కొరత వచ్చి పడింది.

రెట్టింపైన ధరలు : కోతల వేళ మిగిలిన కొద్దిపాటి గడ్డిని మోపులుగా చుట్టే స్ట్రాబెయిలర్స్ యంత్రాలు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. వీటిని ట్రాక్టర్ సహయంతో చేలలో తిప్పి చెల్లాచెదురుగా ఉన్న గడ్డిని యంత్రాలతో మోపులుగా చుడుతున్నారు. ఈ క్రమంలో ఒక్కో మోపుకు రూ.35 చొప్పున నిర్వాహకులు తీసుకుంటున్నారు. పాడిరైతులు పశుగ్రాసం కొని నిలువ చేయటానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గతంలో సాధారణ కూలీలతో కోయించిన ఎండు గడ్డి ఎకరాకు రూ.3 వేల నుంచి రూ.5 వేల ధర పలికేది. ప్రస్తుతం అదే గడ్డి రూ.7 వేల నుంచి 10 వేల ధర పలుకుతుంది. అలాగే గతంలో యంత్రాలతో కోసినదైతే ఎకరానికి రూ.1500 మాత్రమే ఉంటే ప్రస్తుతం ఎకరానికి రూ.4 వేల నుంచి 6 వేల ధరకు రైతులు కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఇదీ కాక తరలింపు చార్జీలు, కూలీల చార్జీలు అదనంగా రైతులపై పడుతున్నాయి. కాట్రేనికోన, ఉప్పలగుప్తం, ఐ.పోలవరం, అల్లవరం, ముమ్మిడివరం, తాళ్లరేవు తదితర మండలాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తుంది. ఈ ప్రాంతాలు సముద్రతీరంలో ఉండటంతో భూసారం లోపం కారణంగా పచ్చగడ్డి ఎదుగుదల తక్కువగా ఉంటుంది. గోదావరి లంక ప్రాంతాల్లో పచ్చగడ్డి పుష్కలంగా లభించినా వరదల సమయాల్లో పూర్తి ఎద్దడి ఏర్పడుతుంది. అందుకే పాడి రైతులు ఎండు గడ్డిని ఒబ్బిడి చేసుకోవటంలో నిమగ్నమవుతున్నారు. పాడి రైతులు ఈ కొరత కాలంలో అధిక ధరలతో గడ్డిని కొనలేక పశువులను మేపే క్రమంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశాలతో అధికారులు సైతం గడ్డిని పాడవ్వకుండా ఒబ్బిడి చేయించి వరద ప్రభావిత ప్రాంతాలకు పంపించే ప్రయత్నాలు చేస్తున్నారు.



ట్రాక్టర్ సహాయంతో తీసుకెళుతున్న ఎండు గడ్డి



స్ట్రాబెయిలర్స్ యంత్రాలతో చుడుతున్న గడ్డి మోపులు

గడ్డికి తీవ్ర కొరత



గడ్డికి తీవ్ర కొరత ఏర్పడి ధరలు పెరిగిపోయాయి. ప్రభుత్వం అందించే టీఎంఆర్ దాణాతో కాలం గడుపుతున్నాం. గడ్డితో పాటు కూలీల రేటు పెరిగింది. వ్యవసాయ పనులకు ఒక్కో కూలీకి రూ.600 తీసుకునేవారు. కాని ఎండలు పెరగటంతో గడ్డి పనికి రూ.1200 పైబడి తీసుకుంటున్నారు.

– వంగా రాఘవులు, పాడి రైతు, కూనవరం, ఉప్పలగుప్తం మండలం

మూడో పంటతో మేలు



ఖరీఫ్ నాట్లు జూన్ మూడు నాలుగు వారాల్లో, రబీ నాట్లు డిసెంబరు రెండు, మూడు వారాల్లో పూర్తి చేసేలా రైతులు ప్రణాళిక రచించుకోవాలి. దాని వల్ల ఏప్రిల్‌లో కోతలు పూర్తయి మూడో పంటగా పశువులకు పౌష్టికాహారంగా జనుము, పిల్లిపెసర, జొన్న, బొబ్బర్ల వంటి పైరులను వేసి పచ్చిమేతగా ఉపయోగించుకోవొచ్చు.

– జి.కుమార్‌బాబు, వ్యవసాయాధికారి, ఉప్పలగుప్తం

రాయితీతో టీఎంఆర్ అందిస్తున్నాం



పాడి రైతులను ఆదుకోవాలనే రూ.15 రూపాయల టీఎంఆర్(టోటల్ మిక్సిడ్ రేషన్) దాణాను రూ.6.50కే ప్రభుత్వం ద్వారా అందిస్తున్నాం. ఈ దాణాను రైతు దఫాకు 2.8 మెట్రిక్ టన్నుల చొప్పున ఆర్డర్ చేసుకోవొచ్చు. ఎండు గడ్డి కొరతతో రైతులు దాణాను బాగా వినియోగించుకుంటున్నారు.

–బి.నాగేశ్వరరావు, ఏడీ పశుసంవర్ధక శాఖ, ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాలు

రూ.40 లక్షల 'మొక్కల టెండరు' రద్దు

- కౌన్సిల్ సమావేశంలో పాలకపక్ష సభ్యుల పట్టుతోనే రద్దు
- ఎక్కువ నర్సరీల నుంచి టెండర్లు పడేలా చూడాలంటూ సూచన



మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: జగనన్న హరిత నగరాలు కార్యక్రమంలో భాగంగా అమలాపురం పట్టణంలో రూ.40 లక్షలతో పచ్చని మొక్కలతో సుందరీకరించేందుకు మొక్కల సమీకరణకు పిలిచిన టెండరును రద్దు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో శనివారం ఉదయం జరిగిన కౌన్సిల్ సమావేశంలో రూ.40 లక్షలకు టెండరు ఖరారైనట్లు కౌన్సిల్ ఆమోదానికి ఉంచిన అంశంపై శాన్ని పాలక పక్షానికి చెందిన కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎక్కువ నర్సరీల నుంచి టెండర్లు పడేలా పత్రికల్లో పూర్తి స్థాయిలో ప్రకటనలు(యాడ్‌లు) ఇచ్చిన తర్వాతే టెండర్ ఖరారు చేయాలని, అంత వరకూ టెండరు ఆమోదించే పరిస్థితే లేదని తెగేసి చెప్పారు. దీంతో అధికారులు టెండర్లు రద్దు చేసి తాజా టెండరు పిలిచేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే డంపింగ్ యార్డ్‌లో కొండల్లా పేరుకుపోయిన చెత్తను తొలగించి అక్కడ ఖాళీ అయ్యే స్థలాన్ని చెత్త శుద్ధీకరణ ప్లాంట్‌కు ఇచ్చే దిశగా అజెండాలో మరో రూ.10 లక్షల నిధుల కేటాయింపునకు కౌన్సిల్ తీర్మానం కోసం పొందుపరిచారు. దీనిపై కూడా కొందరు కౌన్సిలర్లు అభ్యంతరం చెప్పారు. పూర్తి వివరాలతో ఈ అంశాన్ని కౌన్సిల్ ముందు ఉంచాలని, అప్పటి వరకూ అంశాన్ని వాయిదా వేయాలని సూచించారు. దీనిపై మున్సిపల్ డీఈఈ కొత్త అప్పలరాజు ఈ అంశాన్ని వాయిదా వేయొద్దని నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా పూర్తి వివరాలతో కౌన్సిల్ ముందు పెట్టిన తర్వాతే ఆమోదించాలని కౌన్సిలర్ దొమ్మేటి రాము, గొవ్వాల రాజేష్ పట్టుపట్టారు. దీంతో అధికారులు ఆ అంశాన్ని వాయిదా వేశారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, పాలకపక్షం కౌన్సిలర్ సంసాని బులినాని, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఏడిద శ్రీను, పడాల శ్రీదేవి తదితరులు ఈ చర్చలో పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే మా అజెండా

- కౌన్సిల్‌లో చైర్మన్ కమిడి ప్రవీణ్
- సమావేశంలో పోడియం వద్ద బైఠాయించిన ప్రతిపక్ష సభ్యులు



పోడియం వద్ద బైఠాయించిన ప్రతిపక్ష సభ్యులు

ముమ్మిడివరం: ప్రజా సంక్షేమమే అజెండాగా కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాలు అందిస్తున్నామని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీ కౌన్సిల్ హాల్‌లో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. అజెండాలోని అంశాలు చర్చిస్తుండగా ప్రతిపక్ష ఫ్లోర్‌లీడర్ ములపర్తి బాలకృష్ణ మాట్లాడుతూ గత 27 నెలల్లో జరిగిన అభివృద్ధి ఏమి లేదంటూ వాదనకు దిగారు. స్పందించిన చైర్మన్ ప్రవీణ్ మాట్లాడుతూ నగర పంచాయతీలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు ఆనందంగా ఉన్నారని, తమతో పాటు వస్తే ఆ ఆనందం ఏమిటో మీకు తెలుస్తుందంటూ ఘాటుగా సమాధానమిచ్చారు. దీంతో ఫ్లోర్ లీడర్ బాలకృష్ణతో సహా టీడీపీ నాయకులు చైర్మన్ పోడియం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. సమావేశంలో ఇలా నేలపై కూర్చుని నిరసన తెలపడం సరికాదని కౌన్సిలర్లు బొంతు సత్యశ్రీనివాస్, సరిపెల్ల రామకృష్ణంరాజులు హితవు పలికారు. అనంతరం ప్రతిపక్ష వార్డుల్లో జరిగిన అభివృద్ధిని జేఈ పవన్‌కుమార్ వివరించారు. సమావేశంలో కమిషనర్ జి.లోవరాజు, వైస్ చైర్మన్ రెడ్డి హేమ సుందరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: అంబేడ్కర్ ఉన్నత విలువలు కలిగిన మహోన్నత వ్యక్తి అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని బండారులంక నక్కావారి పేటలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి విశ్వరూప్ శనివారం ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు మంత్రి విశ్వరూప్ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగం వల్ల ప్రపంచ ప్రజాస్వామ్య దేశాల్లో భారతదేశం శక్తివంతంగా ఉందన్నారు. కార్యక్రమంలో నడిపూడి సర్పంచ్ చెల్లిబోయిన నాని, రాష్ట్ర వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కేతా భానుతేజ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సరేళ్ళ రామకృష్ణ, నక్కా సందీప్, పమ్మి రాంజీ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: పర్యావరణానికి తీవ్ర హాని కలిగించే ప్లాస్టిక్ నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. శనివారం పోలేకుర్రు, పి.మల్లవరం పంచాయతీల్లో జరిగి లైఫ్ స్టయిల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ప్లాస్టిక్ వినియోగం చాలా పెరిగిందని, దీని వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలుగుతుందన్నారు. దీన్ని నియంత్రించేందుకు ప్రజలు చైతన్యవంతులై ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా అటవీ సిబ్బంది ఆయా గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శ్రమదానం చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, సర్పంచ్‌లు దున్నా సత్యనారాయణ, వెంటపల్లి నూకరాజు, ఎంపీటీసీ సభ్యులు దున్నా రాంబాబు, బళ్ల సంధ్యారాణి, ఉపసర్పంచ్ పంపన రామకృష్ణ, ఉంగరాల వెంకటేశ్వరరావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌లు ఎం.నాగార్జున, ఎస్.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అమలాపురం రూరల్: స్థానిక కలెక్టర్ చాంబర్‌లో పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సమక్షంలో ఇద్దరికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా సీఎం సహాయనిధి చెక్కులను శనివారం అందచేశారు. అయినవిల్లి గ్రామ పంచాయతీకి చెందిన వలంటీర్ జనిపెల్ల దుర్గాప్రసాద్, అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామ వలంటీర్ కత్తుల శ్రీకృష్ణలు మృతి చెందడంతో వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేశారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా జనిపెల్ల దుర్గాప్రసాద్ భార్య జనిపెల్ల శ్రావణ సంధ్య, కత్తుల శ్రీకృష్ణ భార్య కత్తుల సంధ్యకి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వీరిద్దరికి అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగాలు ఇప్పించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- ముమ్మిడివరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా విప్లవాత్మక సంస్కరణలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బాలయోగి కాలువ గట్టు, నేరెళ్ల పాలెంల్లో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ వారికి అందుతున్న సంక్షేమ లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా, లోకేష్ ఎన్ని పాదయాత్రలు చేసినా ఒరిగేదేమి లేదన్నారు. టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పార్టీలన్నీ ఏకమై వచ్చినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు తమ పార్టీకి విజయాన్ని తెచ్చి పెడతాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవానీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జీ, పార్టీ టౌన్ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్, టౌన్ సచివాలయ కన్వీనర్ రెడ్డి శివన్నారాయణ, కౌన్సిలర్ బడుగు శ్రీవాణి, చెల్లి మధు, తాడి అచ్యుతరామయ్య, నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మత్స్యకారులకు వృద్ధాప్య పింఛన్ల అంశాన్ని గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానన్నారు. ఈ నేపథ్యంలోనే 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను 252 మంది మత్స్యకారులకు వృద్ధాప్య పింఛన్లు మంజూరుచేస్తూ పుదుచ్చేరి మత్స్యశాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీచేశారన్నారు. మత్స్యకారులకు పింఛన్లు మంజూరుచేసిన సీఎం రంగసామికి, ఎల్జీ తమిళిసై సౌందరాజన్‌కు, మంత్రి లక్ష్మీనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

జగనన్న పాల వెల్లువపై శిక్షణ



గూడాల సచివాలయంలో పాల వెల్లువపై శిక్షణనిస్తున్న ఎంపీడీఓ సరోవర్

అల్లవరం: పాడి పశువులను గుర్తించి, రైతులను సొసైటీగా ఏర్పాటుచేసి వారికి అవగాహన పరిచేలా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు శిక్షణ ఇచ్చామని ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. ఎంట్రుకోన, గుడాల సచివాలయాల్లో పాల వెల్లువపై శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ కార్యక్రమం ద్వారా వలంటీర్లు సర్వే నిర్వహించి పాడి పశువులను గుర్తిస్తున్నారని చెప్పారు. సర్వే అనంతరం పాడి రైతులు సేకరించిన పాలను అమూల్ కంపెనీకి సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా పాడి రైతుల కష్టానికి తగిన ఫలితం దక్కేలా జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు సాధనాల వెంకటరావు, సర్పంచ్‌లు దాకారపు చిరంజీవిరావు, తిక్కిరెడ్డి శ్రీనివాసరావు, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, ఏపీఎం సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలతో ప్రమాదాల నివారణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: ప్రజలందరూ భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నియంత్రించొచ్చని పలువురు అధికారులు, వక్తలు అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల నివారణ, చర్యలపై ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగిన సదస్సులో పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎంపీపీ రాయుడు సునీత మాట్లాడుతూ వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోరంగి ఏఎస్‌ఐ ఐ.సత్యనారాయణ, రోడ్ సేఫ్టీ ఏఎస్‌ఐ తిరుమలరావులు మాట్లాడుతూ వాహనదారులు విధిగా హెల్మెట్ ఉపయోగించాలని, కారులో సీటు బెల్టు ధరించాలన్నారు. ఆర్టీసీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఏవీఎస్ నారాయణ మాట్లాడుతూ జాతీయ రహదారిలో పలుచోట్ల ఆక్రమణలు చోటు చేసుకున్నాయని, వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణ–చర్యలకు 10 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, అత్తిలి బాబూరావు, రచ్చ ముత్యాలు పాల్గొన్నారు.

కూలి రేట్ల పెంపుదలపై చర్చలు వాయిదా

అమలాపురం రూరల్: జిల్లాలోని మండపేట, ఆలమూరు ప్రాంతాల్లో రైస్‌మిల్లు జట్టు కార్మికులు రేట్లు పెంచాలని ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మిల్లు యాజమాన్యాల ప్రతినిధులు, జట్టు యూనియన్ నాయకులతో కార్మిక శాఖ సహాయ కమిషనర్ (ఏసీఎల్) నాగలక్ష్మి అమలాపురంలోని ఎర్ర వంతెన వద్ద ఉన్న తన కార్యాలయంలో శనివారం చర్చలు ఏర్పాటు చేశారు. కార్మికుల డిమాండ్ మేరకు కూలి రేట్లు పెంచడానికి యాజమాన్యాలు నిరాకరించాయి. కార్మిక చట్టాలు, సౌకర్యాలపై ఇరు వర్గాలకూ ఏసీఎల్ అవగాహన కల్పించారు. జట్టు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, సూరంపూడి గంగరాజు, అఖిల భారత రైతు కూలీ సంఘం నేత వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ తమ శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వడం లేదని అన్నారు. కూలి రేట్లు పెంచేంత వరకూ పోరాటం ఆపేది లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో చర్చలను జూన్ ఒకటో తేదీకి వాయిదా వేస్తున్నామని ఏసీఎల్ నాగలక్ష్మి ప్రకటించారు. యాజమాన్యాల తరపున వైట్ల సత్యనారాయణ, కేవీవీఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

వేతనాల పెంపునకు చర్యలు

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా 21 ఏళ్లుగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాలను కాచి సరఫరా చేసే మిల్క్ బాయిలర్స్ మహిళా సిబ్బందికి రూ.10 వేల వేతనాన్ని రూ.18 వేలకు పెంచాలని ఇటీవలి జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించానని దీనికి పుదుచ్చేరి విద్యాశాఖామంత్రి నమశ్శివాయం స్పందించారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం నమశ్శివాయంను కలిసి వినతిపత్రం సమర్పించానన్నారు. తక్షణం జీతాలు పెంచి గత 12 నెలల జీతాలు సైతం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. స్పందించిన మంత్రి నమశ్శివాయంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఐటీఐ విద్యార్థులకు స్టైపెండ్ పెంపుదల

యానాం: ప్రభుత్వ ఐటీఐలో చదివే విద్యార్థులకు ప్రతి నెలా ఇచ్చే స్టైపెండ్‌ను 2023–24 విద్యా సంవత్సరం నుంచి పెంపుదల చేస్తూ ఎల్జీ తమిళిసై సౌందరాజన్ శనివారం ఆమోదించారు. ఇప్పటివరకూ ప్రతి నెలా ఇస్తున్న స్టైపెండ్ రూ.150ను రూ.1000కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా ప్రత్యేక ఉపకారవేతనాన్ని రూ.300 నుంచి రూ.1000కి పెంచడంతో పాటు ఉచితంగా మధ్యాహ్నభోజనం, యూనిఫాం ఇవ్వనున్నారని తెలిపారు.

గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయాలి

ఉప్పలగుప్తం: దేశాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళుతున్న బీజేపీని గ్రామ గ్రామాన బలోపేతం చేయాలని పార్టీ కిసాన్ మోర్చా జాతీయ అధ్యక్షుడు నల్లా పవన్ అన్నారు. మండంలోని భీమనపల్లిలో మండల స్థాయి కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు.